
# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## 'విలన్ ' రామదాసు

## ( 1968 జూలై విజయచిత్ర నుంచీ పునర్ముద్రణ)



**ముగ్గురు వీరులు,** అగ్గిబరాటా, అవేకళ్ళు, ఇద్దరు మొనగాళ్ళు, సత్యమేజయం, వీరపూజ, శ్రీకృష్ణావతారం, పాపకోసం మొదలైన చిత్రాల్లో ముఖ్య భూమికలు నిర్వహించిన యస్.వి.రామదాసు తమిళ నాటక రంగస్థలం మీద విశేషానుభవం గడించిన వ్యక్తి. రామదాసు పూర్వీకులు మద్రాసు రాష్ట్రంలో స్థిరపడడంవల్ల అతని చదువంతా తమిళంలోనే సాగింది. ఇంట్లో వాళ్ళంతా తెలుగే మాట్లాడుకుంటారు. పరరాష్ట్రంలో స్థిరపడడం వల్ల వాళ్ళ తెలుగు తెలుగులా కనిపించకపోవచ్చును గాని వాళ్ళంతా తెలుగు శుభ్రంగా చదవడం రాయడం చేస్తారు. తమిళంతోపాటు రామదాసు తెలుగు కూడా రాయడం, చదవడం చక్కగా నేర్చుకున్నారు.

రామదాసు సినిమా ప్రవేశం చెయ్యడానికి ముందు, పది సంవత్సరాల పాటు గట్టిగా స్టేజీమీద కృషి చేశాడు మద్రాసులో ఉద్యోగం చేస్తూ.

బి.ఏ చదువుకుంటున్న రోజుల్లో రామదాసుకు సినిమా ఉత్సాహం కలిగింది. అది ఎలా కలిగిందో తెలీదుగాని, అతన్ని మాత్రం బాగా రెచ్చగొట్టింది. ఆ కోరిక మనసులో దూరగానే అతను తండ్రిగారి దగ్గరకు వెళ్ళి "నాన్నా నేను సినిమాల్లో చేరబోతున్నాను" అనేశాడు టక్కున. అదేదో అంత సులభమైనట్టూ తాను లేకుండా సినిమా పరిశ్రమ ఒక్క అడుగైనా ముదుకు వెయ్యలేనట్టూ. తండ్రిగారూ ఆమాటే అన్నారు .పైగా "నీ చదువో?" అని కూడా అన్నారు.

"చదువు మాట దేవుడెరుగు. చదివి ఏం వూళ్ళు ఏలాలి? ఏం ఉద్యోగాలు చెయ్యాలి? ఏదో మనకి భగవంతుడు కాస్త ఇచ్చాడు. ఉద్యోగం మీదనే కేవలం ఆధారపడవలసిన అగత్యంలేదు. అంచేత నేను సినిమాల్లో చేరాలనుకుంటున్నాను. చేరి హీరో వేషాలు వేస్తాను. అందుకు మీ అనుమతీ ఆశీర్వాదం కావాలి" అన్నాడు ఒక్క గుక్కలో ఉపన్యాసధోరణిలో.

ఆ ధోరణికి తండ్రిగారికి కోపం వచ్చింది. చదువుతున్న బి.ఏ చదువుని అలా నట్టేట్లో విడిచిపెట్టి 'సినిమాల్లో చేరిపోతాను' అనడం ఆయనకు ఏ మాత్రం నచ్చలేదు. అసలు, కొడుకు ధోరణి ఆయనకు చాలాకాలంనుంచి అదోలా కనిపిస్తూనే వస్తోంది.

చిన్నతనంలోనే రామదాసు తండ్రిగారికి తెలియకుండా వీధి నాటకాల్లో వేశాడు. భజన పార్టీల్లో పాల్గొన్నాడు. అయితే, అబ్బాయి చదువుమీద శ్రద్ధ బాగా చూపిస్తున్నందువల్ల తండ్రిగారు అతని నాటకాల ధోరణిని అభ్యంతర పెట్టలేదు. ఇవాళ, అతను 'చదువు మానేసి సినిమాల్లో చేరతాను' అనడం చూసి, ఆయన మండిపోయాడు. ఆ మంటను రామదాసు లక్ష్యపెట్టలేదు. మొండిగా వాదించాడు. పట్టుదలగా మాట్లాడాడు.

"అయితే పోయి చేరు. నీకు మాత్రం నేను దమ్మిడీ ఇచ్చేదిలేదు" అని గట్టిగా చెప్పేసి తండ్రిగారు నిష్క్రమించారు. సరే కానిమ్మనుకున్నాడు రామదాసు. దగ్గర వాళ్ళందరితోటీ తనను నాన్నగారు సినిమాల్లో చేరమన్నారు అని అబద్దం చెప్పి మద్రాసు చేరాడు.

మద్రాసులో రామదాసు మేనమామగారున్నాడు. వస్తూనే అతను అక్కడ చేరాడు. సంగతంతా విని మేనమామ, "ముందు బి.ఏ పూర్తి చెయ్యరా" అన్నారు.

రామదాసు సమాధానం చెప్పలేదు. కథంతా విని మళ్ళీ మొదటి కొస్తాడేమిటి అనుకున్నాడు. 'స్వర్గానికొచ్చినా సవితిపోరు తప్పలేదన్నమాట' అని కూడా అనుకున్నాడు మనసులోనే విసుక్కుని. సినిమా ప్రపంచంలో రామదాసు అనుకున్నట్టు ఏదీ జరగలేదు. తన ఉత్సాహాన్ని చూసి, అనేకమంది ప్రొడ్యూసర్లు తనకోసం ఎగబడతారనీ తనవెనకాల క్యూల్లో నుంచుంటారనీ అతను ఊహించిన వూహలు వూహల్లాగే కనిపించాయి. ఉరకలు వేసిన ఉత్సాహోద్దృతం నెమ్మదిగా తగ్గు ముఖం పట్టింది.

"నువ్వు ఇలా సినిమాల్లో వేషాలకని ఎన్నాళ్ళని తిరుగుతావు? నా మాట విని ఏదైనా ఉద్యోగం చెయ్యి. వస్తే సినిమాల్లో వేషాలు వేద్దువుగాని" అని అతని మేనమామ సలహా ఇచ్చాడు.

రామదాసు 'సరే' అనుకున్నాడు. దాంతో అతనికి మద్రాసు హార్బర్‌లో ఉద్యోగం దొరికింది. తొమ్మిది సంవత్సరాలపాటు అతను ఆ ఉద్యోగంలో ఉన్నాడు. ఆ తొమ్మిదేళ్ళూ అతనికి అనేక విషయాలు బోధించడమే కాకుండా, అద్భుతమైన రంగస్థలానుభవాన్ని కూడా కలిగించాయి. 'ఫ్రెండ్స్ అసోసియేషన్' అన్న నాటక సంస్థలో చేరి, అతను ముప్పై అయిదు నాటకాల్లో వివిధ పాత్రలు ధరించి పేరు తెచ్చుకున్నాడు.

ఒకసారి 'ప్రతాపన్' అన్న నాటకం ఆడుతూండగా తమిళనటుడు మనోహర్, రామదాసును చూశాడు. మనోహర్ 'ఇలంగేశ్వరన్' (లంకాధిపతి) అన్న నాటకాన్ని ప్రారంభించబోతున్నాడు. రామదాసును చూసి, అతన్ని తన నాటక సంస్థకు తీసుకుని, ఆ నాటకంలో శ్రీరాముడి పాత్రను ఇచ్చారు. ఆ నాటకం మద్రాసులో చాలాసార్లు ప్రదర్శించారు. రాష్ట్రంలో చాలాచోట్ల ప్రదర్శించారు. రామదాసుకు ఆ నాటకం మంచిపేరు తీసుకొచ్చింది. ఒకసారి బొంబాయిలో ఆ నాటక ప్రదర్శనం జరిగినప్పుడు, నాటకానంతరం పృథ్వీరాజ్ రామదాసును అభినందించినప్పుడు రామదాసు పొందిన ఆనందం ఇంతా  అంతా అని కొలవడానికి లేదు.

'ఇలంగేశ్వరన్' నాటకమే రామదాసుకు సినిమా ప్రవేశం కల్పించింది. ఆ నాటకాన్ని సినిమాగా రూపొందించసాగారు. అందులో రామదాసు తన శ్రీరాముని పాత్రనే ధరించాడు. అయితే ఆ చిత్ర నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. దాంతో రామదాసు నిరుత్సాహపడ్డాడు. అయితే అది ఎంతకాలమో వుండలేదు. 'ఇలంగేశ్వరన్ ' నాటకాన్ని తమిళ చిత్ర నిర్మాతలు జోసఫ్‌తలియత్, యం.వి.రామన్ చూశారు. రామదాసు నటన, అతని కంఠస్వరం వాళ్ళకు నచ్చాయి. జోసఫ్‌తలియత్ తాను  నిర్మిస్తున్న 'విజయపురి వీరన్' చిత్రంలోకీ, రామన్ 'కొంజుం సలంగై' చిత్రంలోకీ రామదాసును తీసుకున్నారు.

'విజయపురి వీరన్' తెలుగులో కూడా నిర్మింపబడడం వల్ల రామదాసు తెలుగులో కూడా నటించాడు. అతని సినిమా ప్రవేశం అలా దాదాపు తెలుగుతోనే జరిగింది. ఆ చిత్రం 'ముగ్గురు వీరులు', 'కొంజుం సలంగై'ను తెలుగులోకి 'మురిపించే మువ్వలు' అన్న పేరుతో 'డబ్' చేశారు. ఆ చిత్రాలద్వారా అతను తెలుగువారికి కూడా పరిచయమైనాడు. 'ముగ్గురు వీరులు' చిత్రంలో నటిస్తున్నప్పుడు, రామదాసు తెలుగు సంభాషణలన్నీ చక్కగా కంఠస్తం చేసి, తిరిగి రాసుకుని చదువుకునేవాడు. మరిచిపోయిన తెలుగును అక్కణ్ణుంచి మళ్ళీ సాధించడం మొదలు పెట్టాడు.

'వీర తిరుమగన్' అన్న చిత్రంలో అతను మొదటిసారిగా దుష్టపాత్ర ధరించాడు. ఆ చిత్రం విడుదలయిన తర్వాత తమిళ పత్రికలు రామదాసు గురించి రాస్తూ 'ఆంధ్ర విలన్' అంటూ రాశాయి. అలాగే అతను ఆంధ్ర విలన్ అయ్యాడు.

విఠలాచార్యగారు రామదాసుకు తెలుగులో మొదటిసారిగా 'అగ్గిబరాటా'లో విలన్ పాత్ర ఇచ్చారు. ఆ పాత్రతోనే అతను తెలుగు చిత్రసీమలో కూడా నటుడిగా స్థిరపడ్డాడు. అప్పట్నుంచీ అతను తెలుగు, తమిళ చిత్రాల్లో ముఖ్య పాత్రధారణ చేస్తూ అనేక చిత్రాల్లో నటించాడు. రామదాసు ఇప్పటికీ తమిళ నాటకాల్లో నటిస్తూనే వున్నాడు. తన సొంత ట్రూప్‌తో అతను చాలా ఊళ్ళల్లో ప్రదర్శనలు ఇచ్చాడు. తెలుగు నాటకాల్లో కూడా నటించాలనీ, తెలుగు దేశమంతా తిరగాలనీ రామదాసుకు మంచి ఉత్సాహంగా వుంది. దానికోసం అతను కృషి చేస్తున్నాడు కూడా. ఇప్పుడు రామదాసు ఐదు తమిళ చిత్రాల్లోనూ, సునందిని పిక్చర్స్, మాడరన్ థియేటర్స్ వారి తెలుగు చిత్రాల్లోనూ నటిస్తున్నాడు. పాపకోసంలో అతను ధరించిన పాత్రనే తమిళ చిత్రంలో కూడా ధరిస్తున్నాడు.

రామదాసుకు విగ్రహంతోపాటు గంభీరమైన కంఠం వుంది. రకరకాలైన 'మాడ్యులేషన్స్' ఆ కంఠంలో అవలీలగా పలుకుతాయి. దానికోసమెప్పుడూ అతను కృషి చేస్తాడు. పట్టుదలగా పనిచేస్తాడు.

"విలన్ పాత్రలే ఎప్పుడూ ధరించాలని నేను అనుకోను. దర్శక నిర్మాతలు ఏ పాత్రలు ఇస్తే అవే ధరిస్తాను. అయితే కొత్త తరహా పాతలు కూడా ధరించాలన్న ఉత్సాహం నాలో బాగా వుంది. అలాంటి అవకాశాలు నాకు కలిగిననాడు, ప్రేక్షకుల అభిమానం ఇంకా సంపాయించుకోగలనన్న ధైర్యం నాకు బాగా వుంది" అన్నాడు రామదాసు.

Post your comments